ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీకాకుళం

జిల్లా వార్తలు


శనివారం 27 సెప్టెంబరు 2025

## భారీ వర్షంపై అప్రమత్తం

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారి జిల్లాలో శని, ఆదివారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది. ఈ నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా అధికారులతో టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది అందుబాటులో ఉండాలి. పరిస్థితులను ఎప్పటికప్పుడు జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలి. బలహీనంగా ఉన్న చెరువుగట్లు, కాలువలను ముందు జాగ్రత్త చర్యగా సరిచేయాల'ని కలెక్టర్ తెలిపారు.

# సహజ అందాలు..

- జిల్లాలో ఎన్నో పర్యాటక, ఆధ్యాత్మిక క్షేత్రాలు
- నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం



టెక్కలి మండలం రావివలసలో ఎండల మల్లన్న

శ్రీకాకుళం జిల్లాలో ఎన్నో చారిత్రక ప్రసిద్ధ ప్రదేశాలు.. క్షేత్రాలు... సుందరమైన ప్రాంతాలు ఉన్నాయి. బారువ, కళింగపట్నంలోని సాగర తీరం.. శాలిహుండాం బౌద్ధ స్థూపాలు.. అరసవల్లి, శ్రీకూర్మం, శ్రీముఖలింగం వంటి పుణ్యక్షేత్రాలు ఇక్కడి చరిత్రకు ఆనవాలుగా నిలుస్తున్నాయి. వీటిని పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ప్రభుత్వానికి ఆదాయం వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. శనివారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని కొన్ని కథనాలు..



బారువ బీచ్‌లో లైట్‌హౌస్

### ఎలా వెళ్లాలంటే..

సోంపేట రైల్వే స్టేషన్ (కంచిలి)లో దిగి సోంపేట ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుకోవాలి. అక్కడి నుంచి పలాస వైపు వెళ్లే ఆర్టీసీ పల్లెవెలుగు బస్సులు బారువ గ్రామంలోకి వెళతాయి. అక్కడి నుంచి బీచ్‌కు చేరుకోవచ్చు. పలాస నుంచి వచ్చే బస్సుల్లోనూ బారువ చేరుకోవచ్చు.

### పర్యాటకం బారువకు వరం

సోంపేట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పర్యాటక ప్రదేశాల పేరు చెబితే ఠక్కున గుర్తుకు వచ్చేది బారువ బీచ్. సమీప గ్రామాల నుంచే కాకుండా ఒడిశా, పశ్చిమబెంగాల్ నుంచి కూడా తరచూ ఇక్కడికి పర్యాటకులు వస్తుంటారు. దేశంలోనే ఎత్తయిన ఇసుక దిబ్బలు ఇక్కడి ప్రత్యేక తను చాటుతాయి. బారువ తీరంలో నిర్మించిన లైట్ హౌస్ ప్రత్యేకార్షణగా నిలుస్తోంది. ఈ ప్రాంతానికి వచ్చిన ప్రతీ వ్యక్తి లైట్‌హౌస్‌ను సందర్శించకుండా ఉండలేరు. లైట్ హౌస్ పక్కన నిర్మిస్తున్న కాటేజీలు సైతం పర్యాటకులకు విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. శ్రీకాకుళం నుంచి ఇటు ఒడిశా వరకు పర్యాటకులు కాటేజీలను చూసేందుకే వస్తున్నారంటే అతిశయోక్తి కాదు. సౌకర్యాలు ఉండటంతో పర్యాటకుల సంఖ్య ఏటా గణనీయంగా పెరిగిపోతోంది.



శాలిహుండాంలోని స్థూపాలు, ప్రాకారాలు

### బౌద్ధం వికసించిన శాలిహుండాం

గార, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): బౌద్ధం వికసించిన నేల శాలిహుండాం. అక్కడ బౌద్ధుల కాలం నాటి ఎత్తయిన పెద్ద స్థూపం... దానికి ఎదురుగా విశాలమైన స్థూపాలు, ప్రాకారాలు, చైత్యాలు... వందల ఏళ్ల నాటి చరిత్రకు ఆనవాలుగా మిగిలి ఉన్నాయి. పవిత్ర వంశధార నది గలగలలతో.. చుట్టూ పచ్చని ప్రకృతి అందాల నడుమ ఉన్న ఈ బౌద్ధ క్షేత్రాన్ని తిలకించేందుకు దేశ, విదేశాల సందర్శకులు వస్తుంటారు. ముఖ్యంగా టిబెట్, చైనా, భూటాన్ తదితర దేశాలకు చెందిన బౌద్ధ భిక్షువులు వచ్చి ఇక్కడ ప్రార్థనలు చేస్తుంటారు. బౌద్ధుల కాలం నాటి ఈ చారిత్రక ప్రదేశం పురావస్తు శాఖ పరిధిలో ఉంది. 1965లో ఇక్కడ తవ్వకాల్లో బయటపడిన బౌద్ధుల శిలా విగ్రహాలు, శిలా శాసనాలు భద్రపరిచి భావితరాలకు మన చరిత్ర, వారసత్వ సంపదను అందించాలన్న సంకల్పంతో అక్కడే ఒక మ్యూజియం ఏర్పాటు చేశారు. ఈ మ్యూజియంను కూడా సందర్శకులు కూడా చూడవచ్చు. కార్తీక మాసంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పాఠశాలల విద్యార్థులు, పర్యాటకులు కుటుంబాలతో పిక్నిక్‌కు వస్తుంటారు. శని, ఆదివారాలు, సెలవు దినాల్లో సందర్శకుల రద్దీ ఉంటుంది.

#### ఇలా చేరుకోవచ్చు..

జిల్లా కేంద్రం శ్రీకాకుళానికి 17 కిలోమీటర్లు దూరంలో శాలిహుండాం ఉంది. అక్కడికి చేరుకోవడానికి శ్రీకాకుళం నుంచి అరసవల్లి రూట్‌లో గార వరకు ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు అందుబాటులో ఉన్నాయి. గారలో దిగి కిలోమీటరు దూరం కాలినడకన అక్కడికి చేరుకోవచ్చు. సింగుపురం జంక్షన్ నుంచి ఏడు కిలోమీటర్లు దూరంలో ఉండే ఈ ప్రదేశానికి ప్రైవేటు వాహనాలు అందుబాటులో ఉన్నాయి.



తేలినీలాపురంలో విదేశీ పక్షులు

### ఇటు రావివలస.. అటు తేలినీలాపురం

టెక్కలి రూరల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో రావివలస ఎండల మల్లికార్జున స్వామి ఆలయం ఒకటి. ప్రపంచలోనే అతి ఎత్తయిన స్వయంభూలింగం ఇక్క ఉంది. కార్తీక మాసంలో ఇక్కడికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. శ్రీకాకుళం నుంచి 50 కిలోమీటరు.. టెక్కలికి కేవలం నాలుగు కిలోమీటర్ల దూరంలో ఈ ఆలయం ఉంది.

#### విదేశీ పక్షుల విడిది కేంద్రం..

విదేశీ విహంగాల విడిది క్షేత్రంగా తేలినీలాపురం దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడికి సైబీరియా దేశపు పక్షులు తరలివస్తుంటాయి. ఏటా సంతానోత్పత్తికి వచ్చి.. ఆ తరువాత మళ్లీ సైబీరియాకు వెళుతుంటాయి. వీటి కోసం ప్రత్యేకంగా టవర్లు ఏర్పాటు చేశారు. కార్తీక మాసంలో అధిక సంఖ్యలో పర్యాటకులు ఇక్కడికి వస్తుంటారు. జిల్లా కేంద్రం శ్రీకాకుళానికి సుమారు 60 కిలోమీటర్ల దూరంలో ఈ కేంద్రం ఉంది.



ప్రారంభానికి సిద్ధమైన అమృత్‌భారత్ రైలు

# నేడు అమృత్‌భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం

- బరంపురం నుంచి సూరత్ వరకూ వెళ్లనున్న ఎక్స్‌ప్రెస్ రైలు
- పలాస, శ్రీకాకుళంరోడ్, విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం రైల్వేస్టేషన్లలో హాల్ట్
- ఉత్తరాంధ్ర ప్రజలకు తీరనున్న కష్టాలు

పలాస, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల కల నెరవేరనుంది. ఒడిశా రాష్ట్రం బరంపురం నుంచి సూరత్ వరకూ ప్రత్యేక రైలు పట్టాలెక్కనుంది. శనివారం బరంపురం రైల్వే స్టేషన్ వద్ద అమృత్‌భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రధానమంత్రి మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. ఈ రైలు బరంపురం నుంచి సూరత్ వరకూ రాకపోకలు సాగిస్తుంది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పలాస, శ్రీకాకుళంరోడ్, విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం రైల్వేస్టేషన్లలో హాల్ట్ కల్పించారు. సూరత్, రాయపూర్, భిలాయ్, అహ్మదాబాద్, గాంధీదామ్ ప్రాంతాల్లో ఉత్తరాంధ్రకు చెందిన అనేక మంది పనిచేస్తున్నారు. వీరు ఆ ప్రాంతాలకు వెళ్లడానికి రైలు సౌకర్యం ఉన్నా పూర్తిస్థాయిలో బెర్త్‌లు దొరక్క జనరల్ బోగీల్లో ప్రయాణిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పటి నుంచో గుజరాత్ వరకూ ప్రత్యేక రైలు నడపాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో అమృత్ భారత్ రైలు అందుబాటులోకి రానుండడంతో తాము కష్టాల నుంచి గట్టెక్కగలమని భావిస్తున్నారు. అలాగే అమృత్‌భారత్ రైలు ఒడిశా, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, గుజరాత్ మీదుగా ప్రయాణిస్తూ వస్త్ర, వాణిజ్య కేంద్రాలను అనుసంధానం చేయనుంది. దీనిద్వారా ఆర్థిక, పారిశ్రామిక చైతన్యం పెంపొందించవచ్చని రైల్వేశాఖ భావిస్తోంది.


- అమృత్ భారత్ రైలు (09022)ను శనివారం మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభించనున్నారు. మరుసటి రోజు 9 గంటలకు సూరత్ (ఉద్నా)కు చేరుకుంటుంది. పార్వతీపురం మీదుగా సుంగర్ పూర్‌రోడ్, మునిగుడ, కేసింగి, కాంటాబంజి,

(మిగతా 8వ పేజీలో..)

# ఇది కూటమి నేతల పంచాయితీ

- ఎచ్చెర్లలో క్వారీ విషయమై రాద్ధాంతం
- తెరచాటుగా ఇద్దరు ప్రజాప్రతినిధుల తగాదా
- అసెంబ్లీకి వరకూ చేరిన వ్యవహారం
- వైసీపీ నాయకుల అక్రమాల సంగతి మరచిన వైనం
- రాష్ట్రస్థాయిలో రచ్చగా మారిన అంతర్గత పోరు

శ్రీకాకుళం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): అధికార పార్టీకి చెందిన కొంత మంది ప్రజాప్రతినిదులు ప్రజలకు ఉపయోగపడేలా చేయాల్సిన అభివృద్ధి పనులు కన్నా.. పంతానికే ప్రాధాన్యమిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో జిల్లా వైసీపీ నాయకులు, అప్పటి ప్రజాప్రతినిధులు ఎన్నో అక్రమాలకు పాల్పడ్డారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కానీ అప్పట్లో జరిగిన అక్రమాల సంగతి అంతా తేలుస్తామని కూటమి నాయకులు ఎన్నికల ముందు ఊకదంపుడు ప్రసంగాలు చేశారు. ఇప్పుడు ఆ సంగతి మరిచిపోయి.. తెరచాటుగా తగాదా పడుతున్నారు. పంతాలకు పోయి.. పరస్పర విమర్శలతో రాష్ట్రస్థాయిలో చర్చగా మారి రచ్చ చేసుకుంటున్నారు.





ఎచ్చెర్ల నియోజకవర్గంలో వివాదానికి కారణమైన కంకర క్వారీ ఇదే..

### వైసీపీ హయాంలో క్వారీకి అనుమతి

ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఓ క్వారీ విషయమై ఇద్దరు ఎమ్మెల్యేలు నేరుగా కత్తులు పట్టుకోకుండా దెబ్బలాడుకుంటున్నారు. పేర్లు చెప్పుకోకుండా పరోక్షంగా ఒకరినొకరు విమర్శలు చేసుకుంటూ తాము మంచివారిమని ధ్రువీకరణ ఇచ్చుకుంటున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎచ్చెర్ల నియోజకవర్గంలోని ఓ కొండపై గ్రావెల్ తవ్వకాలకు గానూ ఓ సంస్థకు అధికారికంగా అనుమతి లభించింది. అప్పుడు ఆ క్వారీపై ఎటువంటి వివాదమూ లేదు. తవ్వకాలూ జరప లేదు. ఎటొచ్చీ.. ప్రస్తుత కూటమికి చెందిన ఇద్దరు కీలక (మిగతా 7వ పేజీలో..)

# జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించండి

- ధరలపై పోస్టర్లను ప్రదర్శించాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్





మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. ఈ విషయమై కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 'ఇంటింటికీ వెళ్లి జీఎస్టీ వలన కలిగే ఆదా గురించి ప్రజలకు తెలియజేయాలి. గ్రామాలు, సచివాలయాల్లో జీఎస్టీ తగ్గింపు ధరల పోస్టర్లు ప్రదర్శించాలి. జిల్లాస్థాయి సమావేశాలు నిర్వహించాల'ని ఆదేశించారు. వ్యాపారులెవరూ వస్తువులు, నిత్యావసర సామగ్రిని ఎక్కువ ధరకు విక్రయించరాదని స్పష్టం చేశారు. జీఎస్టీ కమిషనర్, జిల్లా జీఎస్టీ సూపర్ సేవింగ్స్ నోడల్ అధికారి స్వప్నదేవి మాట్లాడుతూ 'ఈ నెల 30 నుంచి అక్టోబరు 18 వరకు వివిధ రంగాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. 19న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో గొప్ప ముగింపు వేడుకలు జరుగుతాయి. జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు కొంతమేర డబ్బులు ఆదా అవుతాయి. వ్యాపారులకు అమ్మకాలు (మిగతా 8వ పేజీలో..)

శిథిల భవనం తొలగించరు.. నిర్మాణంలో ఉన్నది పూర్తిచేయరు

- ఇదీ కొమరల్తాడలోని అంగన్‌వాడీ కేంద్రం పరిస్థితి

7లో

అసెంబ్లీలో మన ఎమ్మెల్యేల వాణి

- బెంతుల సమస్యను పరిష్కరించండి: అశోక్
- ఉద్యోగులకు ఇబ్బందులు లేకుండా చర్యలు: కూన రవి
- రహదారులను పూర్తి చేయండి: గౌతు శిరీష
- మొగదలపాడు భూములను రెవెన్యూ పరిధిలోకి తీసుకురండి : గొండు శంకర్
- భవనాలు మంజూరు చేయాలి: మామిడి గోవిందరావు

7లో

# పోస్టాఫీసుల్లో రాత్రి 8వరకు ఆధార్ సేవలు

- సూపరింటెండెంట్ హరిబాబు

అరసవల్లి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం పోస్టల్ డివిజన్‌లోని హెడ్ పోస్టాఫీసుల్లో ఇక నుంచి ఆధార్ సేవా కౌంటర్లు ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8గంటల వరకు అందుబాటులో ఉంటాయని హెడ్ పోస్టాఫీసు సూపరింటెండెంట్ వి.హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'శ్రీకాకుళం, ఆమదాలవలస, టెక్కలి హెడ్ పోస్టాఫీసుల్లో ఈ సేవలు లభ్యమవుతాయి. ఈ కేంద్రాల్లో కొత్త ఆధార్ నమోదు, పేరు, చిరునామా, పుట్టిన తేదీ, మొబైల్ నెంబర్, ఈమెయిల్ ఐడీ నవీకరణ, బయోమెట్రిక్ అప్‌డేట్‌తో పాటు అన్ని రకాల ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయి. సేవలను పొందేవారు తప్పనిసరిగా గుర్తింపు, చిరునామా, జనన ధ్రువీకరణ పత్రాలను సమర్పించాల'ని ఆయన తెలిపారు. అలాగే పోస్టల్ శాఖకు చెందిన "దీన్ దయాళ్ స్పర్శ యోజన" స్కాలర్‌షిప్ మొదటి స్థాయి పరీక్షను అక్టోబరు 12వ తేదీకి వాయిదా వేశామన్నారు. మరింత సమాచారం కొరకు సంబంధిత వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

# బంగారం దుకాణాలపై దాడులు

- హోల్‌సేల్ వ్యాపారాలే లక్ష్యంగా సోదాలు
- జీరో ట్యాక్స్ లావాదేవీలపై ఆరా
- షాపులు, ఇళ్లలో సోదాలు
- వ్యాపారుల్లో అలజడి





నరసన్నపేటలో మూతపడిన బంగారం దుకాణాలు



నరసన్నపేటలోని బంగారం షాపులో సోదాలు చేస్తున్న కేంద్ర జీఎస్టీ అధికారులు

నరసన్నపేట, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): నరసన్నపేటలో బంగారం దుకాణాలపై కేంద్ర జీఎస్టీ కస్టమ్స్ అధికారులు శుక్రవారం దాడులు చేపట్టారు. నరసన్నపేటలో అడ్డదారిలో బంగారం వ్యాపారం సాగుతున్నట్టు ఉన్నతాధికారులకు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో విశాఖపట్నం కేంద్ర జీఎస్టీ అండ్ కస్టమ్స్ శాఖ డిప్యూటీ కమిషనర్ వర్మ నేతృత్వంలో ప్రత్యేక బృందాలు పట్టణంలో బంగారం షాపులు, హోల్‌సేల్ వ్యాపారుల ఇళ్లలో సోదాలు చేశాయి. స్థానిక తమ్మయ్యపేటలోని ఉప్పు గిరి ఇంట్లో సోదాలు చేసి పలు డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం పేట జంక్షన్‌లోని శ్రీగౌరీ శంకర్ జ్యూయలర్స్ షాపులో కూడా దాడులు చేశారు. శుక్రవారం ఉదయం 10గంటలు నుంచి రాత్రి వరకు సోదాలు చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఇటీవల కోయంబత్తూరులో బంగారం వ్యాపారి నుంచి భారీ మొత్తంలో జీరో ట్యాక్స్‌లో లావాదేవీలు నిర్వహించినట్లు అధికారుల దాడుల్లో బయట పడింది. దీంతో ఈ వ్యవహారంలో నరసన్నపేటలోని మరో నాలుగు హోల్‌సేల్ దుకాణాలతో పాటు మరికొందరు వ్యాపారుల లావాదేవీలు, జీరో ట్యాక్స్ వ్యాపారంపై అధికారులు ఆరా తీశారు. హోల్‌సేల్ వ్యాపారులు తమిళనాడులోని కోయంబత్తూరు నుంచి గత మూడేళ్లుగా ఎంతెంత బంగారం లావాదేవీలు నిర్వహించారు. సంబంధిత బంగారాన్ని స్థానికంగా ఎవరికి విక్రయించారో.. వాటి డాక్యుమెంట్లను పరిశీలించినట్లు (మిగతా 8వ పేజీలో..)

14 కిలోలతో గంజాయి స్మగ్లర్ అరెస్టు

హోటల్‌లో అగ్ని ప్రమాదం

8లో

## సూపర్ జీఎస్టీపై ప్రజలకు వివరించండి

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ సేవింగ్స్‌పై ప్రజలకు వివరించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం జీఎస్టీ సూపర్ సేవింగ్స్, పీఎం కుసుమ్,సీబీజీ ప్లాంట్లు, సౌర పవన ప్రాజెక్టులు, గంజాయి, డ్రగ్స్, అన్నాక్యాంటీన్లు, చెత్త సేకరణ, భూసమస్యలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి సుమారు రూ.ఐదు వేలకోట్ల నష్టం వచ్చినా ప్రభుత్వం ప్రజల కోసం భరిస్తోందన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ జీఎస్టీ, జిల్లా అధికారులతో ఎప్పటికే సమావేశం ఏర్పాటు చేశామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ డి.పృథ్వీరాజ్‌కుమార్, జీఎస్టీ అధికారులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఏఐవైఎఫ్ నాయకులతో కలిసి స్టాప్‌డ్రగ్స్ - స్టార్ట్ స్పోర్ట్స్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఏఐవైఎఫ్ నాయకులు మాట్లాడుతూ భగత్‌సింగ్ జయంతి పురస్కరించుకుని జిల్లాలో ఆదివారం నుంచి అక్టోబరు నాలుగో తేదీ వరకూ మత్తుపదార్థాలకు వ్యతిరేకంగా సదస్సులు నిర్వహించి యువతలో చైతన్యం తీసుకువస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొత్స సంతోష్, కొన్న శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## కేరళలో జిల్లా కళాకారుల నృత్య ప్రదర్శన

ఆమదాలవలస, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన నాట్య కళాకారిణి కూనశ్రీలత ఆమె బృంద కళాకారులు కేరళలో దసరా ఉత్సవాల్లో భాగంగా నృత్య ప్రదర్శన ఇచ్చారు. ఆమదాలవలసకు చెందిన నాట్య కళాకారులు డాక్టర్ రవి, బాలకృష్ణ ఆధ్వర్యంలో కేరళలోని బుధ, గురువారాల్లో ప్రదర్శనలు ఇచ్చినట్లు శీలత తెలిపారు. అన్నామలై పట్టణ త్రిబంగి ఉత్సవ నిర్వహణలో భాగంగా సంగీత్‌నాటక అకాడమీ సీఎస్‌ఏ మండపంలో మోహిని భస్మాసుర నృత్యాన్ని ప్రదర్శించినట్లు చెప్పారు.

## రసాయన ఎరువుల వాడకం ప్రమాదకరం: ఏడీ

సరుబుజ్జిలి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి):రైతులు సేంద్రీయ ఎరువులు వాడకాన్ని పూర్తిగా విస్మరించి రసాయన ఎరువులను వినియోగించడం ప్రమాదకరంగా మారిందని వ్యవసాయశాఖ ఏడీ బి.రాజగోపాల్ తెలిపారు. శుక్రవారం వెన్నెలవలసలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎరువుల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్డి ఫౌండేషన్ సమన్వయకర్త లావణ్య, రైతులు అత్తులూరిహరి ప్రసాద్, సవర ధర్మారావు, ఎల్లయ్య, సవర బుడ్డు, బిడ్డిక రమేష్ పాల్గొన్నారు.

## డీజేలను అరికట్టాలి

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): డీజే శబ్దాల వల్ల తీవ్ర నష్టం జరుగుతుండడంతో వాటిని అరికట్టాలని శ్రీమహంతి సాంస్కృతిక కళాసేవా సంస్థ సభ్యులు కోరారు. శుక్రవారం ఈదుపురంలో ఆ సంస్థ ఆధ్వర్యంలో జరిగినసమావేశంలో సభ్యులు మాట్లాడుతూ డీజేశబ్దాలకు గుండె వ్యాధులు వస్తున్నాయని తెలిపారు.కార్యక్రమంలో సంస్థప్రతినిధులు ధనుంజయ, జానికిరామిరెడ్డి, గంగయ్య, హేమలత,రామారావు,కూర్మారావు పాల్గొన్నారు.

## సోంపేటలో జాబ్‌మేళా

సోంపేట, సెప్టెంబరు 26 :సోంపేటలోని ఓ డిగ్రీకళాశాలలో శుక్రవారం జాబ్‌మేళా రాష్ట్రనైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 11 కంపెనీల ప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించిన మేళాలో 336 మంది హాజరు కాగా 179మందిని వివిధ కంపెనీలు ఎంపిక చేసినట్లు ఓ కళాశాల కరస్పాండెంట్ కొంచాడ శేషాద్రి తెలిపారు.కార్యక్రమంలో జిల్లా ఉపాధికల్పనాధికారి కె.సుధారాణి, నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్, నెహ్రూయువకేంద్రం డిప్యూటీ డైరెక్టర్ ఉజ్వల పాల్గొన్నారు.

## భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

సోంపేట రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): భగత్‌సింగ్ జీవితం యువత ఆదర్శంగాతీసుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం ఎకువూరులో భగత్‌సింగ్ జయంతి పురస్కరించుకుని భగత్‌సింగ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మినరల్ వాటర్‌కు ఆర్థికసాయాన్ని ఉపాధ్యాయులకు సంఘ సభ్యులు అందజేశారు.

## గోశాలకు పశువుల తరలింపు

ఎచ్చెర్ల, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట నుంచి విశాఖ శుక్రవారం వ్యాన్‌తో అక్రమంగా తరలిస్తున్న ఏడు పశువులను ఎచ్చెర్ల మండలంలోని నవభారత్ జంక్షన్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు ఆ పశువులను విజయనగరం జిల్లాలోని కొత్తవలస గోశాలకు తరలించారు. బాధ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వి.సందీప్‌కుమార్ తెలిపారు.

## యూరియా పంపిణీలో ప్రభుత్వం విఫలం

కంచిలి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా పంపిణీలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమయ్యిందని జడ్పీ ఛైర్‌పర్సన్ పిరియా విజయ, ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం కంచిలి ప్రభుత్వ కార్యాలయాల కూడలిలో రైతులకు యూరియా అందించాలని జడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, మాజీ ఎంపీపీ కృష్ణారావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

## మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యం

ఆమదాలవలస, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల ఆరోగ్య భద్రతకు అధిక ప్రాధాన్యతనిస్తున్నాయని తొగరాం పీహెచ్‌సీ వైద్యాధికారి మెట్ట స్రవంతి తెలిపారు. శుక్రవారం కొర్లకోట ఆరోగ్య ఉప కేంద్రంలో స్వస్తినారీ స్వశక్తి అభియాన్ పరివార్ కార్యక్రమం నిర్వహించారు. కార్య క్రమంలో ఎంపీటీసీ అన్నెపు భాస్కరరావు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేడాడ సూరపునాయుడు, సనపల అప్పలనాయుడు పాల్గొన్నారు.

## ఇసుక పేరుకుపోయి.. ప్రమాదాలు చోటుచేసుకుని

పొందూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొడ్డేపల్లి రోడ్డులో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ మార్గంలో బొడ్డేపల్లి ఇసుక ర్యాంపు నుంచి ప్రతి రోజూ 30 లారీలు ఇసుకను తరలిస్తున్నారు. అయితే తరలించే సమయంలో ఇసుక బీటీరోడ్డుపై జారిపోవడంతో అర అడుగు మేర పేరుకుపోయింది. దీంతో ఈ మార్గంలో రాకపోలు సాగించే తాడివలస, బెలమాం, లచ్చయ్యపేట తదితర గ్రామాల వైపు వెళ్లే వాహనాలు ఇసుకపై జారిపడుతుండడంతో పలువురు గాయపడుతున్నారు. తక్షణమే ఆర్‌అండ్‌బీ అధికారులు ఇసుక పొర తొలగించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.



బీటీరోడ్డుపై ఇసుక పేరుకుపోయిన దృశ్యం

## సకాలంలో రుణాలు ఇవ్వండి

కవిటి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): రైతులకు రుణాలను సకాలంలో అందించేలా ఏర్పాట్లు చేయాలని డీసీసీబీ ఛైర్మన్ ఎస్.సూర్యనారాయణ కోరారు. కవిటిపీఏసీఎస్ కార్యాలయంలో ఛైర్మన్ వై.బాసుదేవ్‌ప్రధాన్, సీఈవో బి.చిరంజీవితో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కవిటిలో స్థలం ఏర్పాటుచేస్తే భవన నిర్మాణానికి సహకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పి.కృష్ణారావు, చిన్నబాబు, రమేష్, బి.తిరుమలరావు పాల్గొన్నారు.

● ఇచ్ఛాపురం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం పీఏసీఎస్ పరిధిలో అర్హత గల రైతులను సభ్యులుగా చేర్చాలని డీసీసీబీ ఛైర్మన్ శివ్వాల సూర్యనా రాయణ కోరారు. శుక్రవారం స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు పెదిని బాబ్జీ, సీఈవో బి. భుజంగరావు, సిబ్బంది , రైతులు పాల్గొన్నారు.



కవిటి: మాట్లాడుతున్న సూర్యనారాయణ

# శిథిల భవనం తొలగించరు.. నిర్మాణంలో ఉన్న భవనం పూర్తిచేయరు



అర్థాంతరంగా నిలిచిపోయిన అంగన్‌వాడీ భవనం

వజ్రపుకొత్తూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమరల్తాడ అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరింది.దీంతో ఎప్పుడు కూలుతుందోనని చిన్నారుల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు.ప్రస్తుతం అంగన్‌వాడీకేంద్రం పాతపాఠశాల భవనంలో నిర్వహిస్తున్నారు.ఈభవనం శ్లాబ్‌పెచ్చులూడుతుండడంతో ఎప్పుడు ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనన్న భయాందోళన స్థానికుల్లో నెలకొంది.కాగాఈ అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకుచేరంతో పక్కనే మరోభవనం నిర్మాణానికి పునాదుల వేసి ఏళ్లు గడుస్తున్నా భవనం నిర్మాణం పూర్తికావడంలేదు.ప్రస్తుతం కొనసాగుతున్న భవనం ఖాళీచేయించి కనీసం అద్దెభవనంలో నిర్వహించాలని కోరుతున్నా అధికారులు స్పందించడంలేదని చిన్నారుల తల్లిదండ్రులు చెబుతున్నారు.శిథిలావస్థకు చేరిన భవనం తొలగించడంలేదని, నిర్మాణంలో ఉన్న భవనం పూర్తి చేయడానికి కూడా చర్యలు చేపట్టకపోవడంపై స్థానికంగా విమర్శలొస్తున్నాయి.ఇప్పటికైనా అధికారులు శిథిలావస్థకు చేరిన భవనంలో ఉన్న తరగతులు మరో గదిలో నిర్వహించాలని కోరుతున్నారు. కాగా అధికారులు దృష్టికి ఎన్నిసార్లు ఈ సమస్య తీసుకువెళ్లినా స్పందించడం లేదని సర్పంచ్ చింతరాజు చెప్పారు. మండల సర్వసభ్యసమావేశాల్లో అంగన్‌వాడీ భవనం సమస్య ప్రస్తావన చేసినట్లు తెలిపారు. నష్టం జరిగిన తరువాత స్పందించడం కంటే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు.

● ఇది కొమరల్తాడలోని అంగన్‌వాడీ కేంద్రం పరిస్థితి



అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్న శిథిలావస్థలోఉన్న పాఠశాల భవనం ఇదే

## అసెంబ్లీలో మన వాణి

### భవనాలు మంజూరు చేయండి

● పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



పాతపట్నం/ మెళియాపుట్టి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని పాతపట్నం, కొత్తూరులలో గల జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల నిర్వహణకు శాశ్వత భవనాలు మంజూరు చేయాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. పాతపట్నంలో 1966 నుంచి ఆర్‌అండ్‌బీకి సంబంధించిన భవనంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు కొనసాగుతోందని తెలిపారు. ఆ భవనం ఇప్పటికే శిథిలావస్థకు చేరినందున కూలిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. కొత్తూరులో మండల పరిషత్ కార్యాలయ భవనంలో కోర్టు కొనసాగుతోందని వివరించారు. ఈ రెండు చోట్ల శాశ్వత భవనాల నిర్మాణానికి నిధులు మంజూరుచేయాలని కోరారు. దీనికి న్యాయశాఖ మంత్రి ఎన్.ఎండి. ఫరూక్ స్పందించారు. అతి త్వరలోనే నిర్మాణ ప్రక్రియ చేపడతామంటూ మంత్రి సమాధానమిచ్చారు.

### మొగదలపాడు భూములను రెవెన్యూ పరిధిలోకి తీసుకురండి

● శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్



అరసవల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి):గారమండలం మొగదలపాడులోని భూములు రెవెన్యూ పరిధిలో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అసెంబ్లీలో శుక్రవారం ప్రస్తావించారు. గత కొన్నేళ్లుగా అక్కడి భూములు అటవీ శాఖ, కోస్టల్ కారిడార్ పరిధిలోను ఉండిపోవడంతో ఎటువంటి రిజిస్ట్రేషన్లకు నోచుకోవడంలేదని తెలిపారు. తమ భూములపై ఎటువంటి హక్కు లేకపోవడంపై గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారని ఎమ్మెల్యే వివరించారు. ఈ సమస్యపై రెవెన్యూ మంత్రి స్పందించి భూములను రెవెన్యూ పరిధిలోకి వచ్చేలా నోటిఫై చేయాలని కోరారు.

### ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

● ఆమదాలవలస ఎమ్మెల్యే రవికుమార్



ఆమదాలవలస, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో విద్య,వైద్యం, దేవదాయ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సమస్యలపై సంబంధిత శాఖామంత్రులు చర్యలు తీసుకోవాలని పీయూసీ ఛైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ కోరారు. శుక్రవారం అసెంబ్లీలో ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ '1998లో ఉపాధ్యాయులుగా విధుల్లో చేరిన ఉద్యోగులు కేవలం మినిమం టైమ్ స్కేల్‌తో విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల వారిని వందల కిలోమీటర్ల దూరం బదిలీలు చేయడంతో చాలా ఇబ్బందులకుగురవుతున్నారు. వారి గ్రామాలకు అందుబాటులో లేదా క్లస్టర్ పరిధిలో విధులు నిర్వహించే విధంగా విద్యాశాఖ మంత్రి చర్యలు తీసుకోవాలి. వివిధ కళాశాలల్లో జూనియర్ అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు కూడా పలు సమస్యలతో సతమతమవుతున్నారు. వారికి కూడా న్యాయం చేయాలి. వివిధ దేవాలయాల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు చొరవతో గతంలో అనేక మంది ఎన్ఎంఆర్ ఉద్యోగులుగా విధుల్లో చేరారు. నేటికీ వారు ఎన్నెమ్మార్‌లుగా, కాంట్రాక్ట్ ఉద్యోగులుగా కొనసాగుతున్నారు. వారికి న్యాయం చేయాల'ని రవికుమార్ కోరారు.

### రహదారులను పూర్తి చేయండి

● పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష



పలాస, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న రహదారుల నిర్మాణాలను పునః ప్రారంభించి... పూర్తిచేయాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అసెంబ్లీలో కోరారు. 2019కి ముందు ప్రతి నియోజకవర్గంలో రహదారి పనులు ప్రారంభించారని తెలిపారు. ఆ పనులు పూర్తి చేసేలోపే ప్రభుత్వం మారడంతో ఎక్కడి పనులు అక్కడే మిగిలిపోయాయన్నారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీప్రభుత్వం తట్టెడు మట్టి కూడా అందులో వేయలేదని తెలిపారు. ప్రస్తుతం ప్రజలు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా సంబంధిత మంత్రిత్వ శాఖ ద్వారా వీటికి నిధులు ఇచ్చి రహదారులు పూర్తిగా నిర్మించాలని ఆమె కోరారు.

### బెంతుల సమస్యను పరిష్కరించండి

● ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అశోక్



కవిటి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి):ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఉన్న బెంతుఒరియా కులస్థుల సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే బి.అశోక్ శుక్రవారం అసెంబ్లీలో కోరారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా కుల గుర్తింపు కోసం పోరాటంచేస్తున్న బెంతు ఒరియాలకు న్యాయంచేయాలని కోరారు. కులగుర్తింపుతో పాటు నివాస ధ్రువీకరణకు నోచుకోక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సభదృష్టికి తీసుకువెళ్లారు. 1994లో చంద్రబాబు సీఎంగాఉన్న సమయంలో ప్రభుత్వం ఇచ్చిన మోమో ఆధారంగా కొంతమందికి న్యాయం జరిగిందన్నారు.గతప్రభుత్వంలో ఆకులంపై రెండు కమిషన్లు వేసినా నివేదికలు ఏమయ్యాయో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఈ తెగవారు అందుకోలేని దుస్థితిలో ఉన్నారని తెలిపారు. వారికి న్యాయం చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

## 29న వైద్య శిబిరం

గార, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.మత్స్యలేశం (పోర్టు కళింగపట్నం)లో ఈనెల 29న మెగా ఉచిత వైద్య, రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు బీజేపీ మండలాధ్యక్షురాలు మైలపల్లి లక్ష్మీజనార్ధన్ ఒక ప్రకటనలో తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎస్.తేజేశ్వరరావు ఆదేశాల మేరకు ప్రధాని మోదీ జన్మదిన పక్వాడ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

## వికసిత్ భారత్‌పై క్విజ్

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ క్విజ్‌లో పాల్గొవడానికి ఆన్‌లైన్ అక్టోబరు 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సెట్‌శ్రీ సీఈవో వీవీ అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర యువ జనవ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా 15 నుంచి29 ఏళ్ల మధ్య వయసు గల వారికి నిర్వహించే వికసిత్ భారత్ యంగ్ ఛాలెంజ్ క్విజ్‌కు ఎంట్రీ ఫీజు లేదని పేర్కొన్నారు.

## ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి




నియామకపత్రం అందజేస్తున్న శిరీష

సోంపేటరూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరాలకు ఉత్తమ పౌరులను తీర్చిదిద్దాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు.కూటమి ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులను నియామక పత్రాలను శిరీష శుక్రవారం అందజేశారు.ఈ మేరకు మండలంలోని ఎర్రముక్కాం గ్రామానికి చెందిన అంబటి ఆశ డీఎస్సీలో ఒకేసారి మూడు ఉద్యోగాలకు అర్హత సాధించింది. దీంతో ఆశను శిరీష ప్రత్యేకంగా పిలిచి అభినందించారు. ఒకేసారి మూడు ఉద్యోగాలకు అర్హత సాధించడం జిల్లాకు గర్వకారణమని శిరీష తెలిపారు.

## కంట్రోల్ రూము ఏర్పాటు

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంప్రభావంతో రానున్న48గంటల్లో పిడుగులతో భారీ నుంచి అతి భారీవర్షాలు కురిసే అవకాశం ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎస్.వెంకటరావు తెలిపారు. అత్యవసర సమాచారానికి కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటుచేశామని, శిథిలావస్థ భవనాలు, చెట్ల కింద ఉండకూడదని పేర్కొన్నారు.

## ఇది కూటమి నేతల పంచాయితీ

(ఐదో పేజీ తరువాయి)

ప్రజాప్రతినిధులు ఈ క్వారీపై పంతాలకు పోతున్నారు. ఈ విషయంలో ప్రభుత్వానికి కాస్త ఇబ్బందికరంగా ఉండేలా వ్యవహరిస్తున్నారు. క్వారీపై కంకర తవ్వకాలను సమీప గ్రామస్థులు అడ్డుకుంటున్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గానికి చెందిన అధికారపార్టీ ప్రజాప్రతినిధి సహకారంతోనే గ్రామస్థులు ఆందోళనలు సైతం చేస్తూ తవ్వకాలను అడ్డుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కాగా వైసీపీ హయాంలో వేరొకరి పేరుతో చేజిక్కించుకున్న ఈ క్వారీని ఆమదాలవలస నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధి పరోక్షంగా నిర్వహిస్తున్నారని అంతటా ప్రచారం సాగుతోంది. ఈ క్రమంలో ఈ క్వారీ కూటమిలో ఇద్దరి ప్రజాప్రతినిధుల మధ్య అంతర్గత పోరుకు దారి తీసింది. ఆ ఇద్దరూ పరోక్షంగా ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారు. ఇటీవల అసెంబ్లీ వేదికగా కూడా క్వారీ విషయమై చర్చ సాగడం గమనార్హం. తాము ఏ తప్పూ చేయలేదని.. క్వారీ వివాదంలో వెనకున్నది ఎవరో తేల్చాలంటూ కోరడం విశేషం. ఇదే అవకాశంగా వైసీపీ నేతలు.. వారిద్దరి పనితీరుకు అవినీతి మరక అంటించి వారివంతు ప్రచారం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆ ఇద్దరు నేతలూ క్వారీ సమస్యను సరిదిద్దుకోవాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

● ప్రత్యర్థులతో పోరాడరేం?

గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో వైసీపీ ప్రజాప్రతినిధులు చంద్రబాబునాయుడు, లోకేశ్, పవన్‌కల్యాణ్‌పై తీవ్రస్థాయిలో విరుచుకు పడుతూ.. బూతులతో రెచ్చిపోయారు. ప్రజా ఆస్తులను సైతం లూటీ చేసి.. టీడీపీ నాయకులపై కేసుల మోత మోగించారు. ఇప్పుడు ఎచ్చెర్ల క్వారీ విషయంలో విచారణ జరపాలని కోరుతున్న ప్రజాప్రతినిధే.. వైసీపీ హయాంలో బాధితుడిగా ఉన్నారు. అత్యధికంగా అట్రాసిటీ కేసులు నమోదయ్యేలా వైసీపీ నాయకులు వ్యవహరించారు. ఇక ఇతర నియోజకవర్గాల విషయానికొస్తే.. అప్పటి వైసీపీ నాయకులు తమ్మినేని సీతారాం, ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కృష్ణదాస్, సీదిరి అప్పలరాజు, దువ్వాడ శ్రీనివాస్ వంటివారు జిల్లాలో అధికారాన్ని అడ్డబెట్టుకుని అప్పట్లో అక్రమాలకు పాల్పడ్డారని టీడీపీ నాయకులు ఆరోపణలు చేశారు. ఆ వైసీపీ నాయకుల పేర్లను రెడ్‌బుక్‌లో నమోదు చేయించామని ప్రగల్భాలు పలికారు. అధికారంలోకి వచ్చాక వారి సంగతి మరిచిపోయారు. వారు పెట్టిన కేసులనుంచి బెయిల్ తీసుకున్నారే కానీ.. అధికారంలోకి వచ్చాక ప్రజలు కోరుకున్నట్లు వ్యవహరించడంలేదు. పోరాడాల్సింది ప్రత్యర్థులతో అన్నది గుర్తుంచుకోకుండా అసెంబ్లీకి వివాదాన్ని తీసుకెళ్లారు. ఇప్పటికైనా వివాదాల నుంచి బయటపడితే కూటమి ప్రజాప్రతినిధులకే మేలు. లేదంటే వైసీపీ నాయకులకు ఇటువంటి తప్పిదాలే ఆయుధాలుగా అందించినట్లవుతుందని ప్రజలు భావిస్తున్నారు.

## ఎన్‌ఈఆర్‌పై ఆరోపణలు వెనక్కి తీసుకోవాలి

లావేరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావుపై మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌చేసిన ఆరోపణలు వెనక్కు తీసుకోవాలని లావేరు పీఏసీఎస్ అధ్యక్షుడు కూనపల్లి దామోదరరావు కోరారు. శుక్రవారం లావేరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్‌ఈఆర్ భూదందాలు, ఇసుక ఇసుక గ్రావెల్ తదితర అవినీతి అక్రమాలకు ఎప్పుడూ పాల్పడలేదని తెలిపారు. ఎన్‌ఈఆర్ నీతి, నిజాయితీకి నిలువెత్తు నిదర్శనమన్నారు. తామాడ కొండపై గ్రావెల్ అక్రమంగా తీసి మాజీ ఎమ్మెల్యే కొల్లగొట్టారని విమర్శించారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని కోట్లాది విలువ చేసే 40 ఎకరాలకుపైగా భూకబ్జా చేయలేదా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో కూటమి నాయకులు అరెళ్ల కృష్ణ, కొన్ని హేమసుందరరావు, లంక నారాయణరావు, సిరిపురపు జగన్నాథం, దన్నాన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## హైకోర్టు సర్క్యులర్‌పై న్యాయవాదుల నిరసన

ఆమదాలవలస, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు జారీచేసిన సర్క్యులర్ ప్రకారం కోర్టుల్లో సంతాపాలను ఉదయం ప్రారంభసమయంలో కాకుండా సాయంత్రం పాటించాలని ఆదేశించిన నిర్ణయానికి వ్యతిరేకకంగా బార్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం విధులను బహిష్కరించి నిరసన తెలిపారు.వెంటనే సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోవాలని కోరారు. బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపు సత్యనారాయణ, సెక్రటరీ బగాది గోవిందరాజు, న్యాయవాదులు అల్లాడ విజయ్‌కుమార్, సాధు ధనుంజయరావు, పైడి వరహా నరసింహులు, తమ్మినేని అన్నం నాయుడు, సీతారాం, మోహన్‌రావు, రాజేశ్వరరావు, హనుమంతు అచ్చెన్నాయుడు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలి

● మంత్రులు లోకేష్, సంధ్యారాణికి అంగన్‌వాడీల వినతి



మంత్రి లోకేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ యూనియన్ నాయకులు

ఇచ్ఛాపురం, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి):అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని, వేతనాలు పెంచాలని ఇచ్ఛాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షురాలు బర్ల హైమావతి కోరారు. శుక్రవారం అంగన్‌వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్‌తో కలిసి అసెంబ్లీ ప్రాంగణంలో మంత్రులు నారాలోకేష్, సంధ్యారాణిలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీకార్యకర్తలు సుహాసిని, హిమ,పుణ్యావతి పాల్గొన్నారు.

## 14 కిలోలతో గంజాయి స్మగ్లర్ అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న రైల్వే ఎస్‌ఐ కోటేశ్వరరావు

పలాస, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రానికి చెందిన మోరీస్ అనే గంజాయి స్మగ్లర్ 14కిలలతో శుక్రవారం పట్టుబడినట్టు రైల్వే ఎస్‌ఐ ఎ.కోటేశ్వరరావు తెలిపారు. రైల్వేస్టేషన్ ప్లాట్ ఫారం-2లో విధులు నిర్వహిస్తున్న రైల్వే పోలీసులకు ఎరుపు రంగు బ్యాగుతో అనుమానాస్పదస్థితిలో ప్రయాణికుడు ఒకరు కనిపించారు. ఆయన్ను ప్రశ్నించి బ్యాగ్ తనిఖీ చేయగా గంజాయి బయటపడిందన్నారు. నిందితుడు మోరీస్ ఒడిశా రాష్ట్రం రాయఘడకు చెందిన రాహుల్ అనే గంజాయి పండించే వ్యక్తివద్ద రూ.71 వేలకు కొనుగోలు చేసుకొని తమిళనాడు తరలిస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు ఆయన్ను అరెస్టు చేసి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈయన్ను విశాఖ రైల్వే కోర్టులో హాజరుపరుస్తున్నట్టు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కోటబొమ్మాళి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి గ్రామ సమీపంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన వాన వైకుంఠరావు(55) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వైకుంఠరావు గురువారం సాయంత్రం సరియాపల్లి గ్రామ సమీపంలో ఉన్న పొలం పనులు ముగించుకొని నడుచుకుంటూ ఇంటికి వస్తుండగా అదే గ్రామానికి చెందిన కప్పల రమణ తన ద్విచక్రవాహనం పై వెనుక నుంచి బలంగా ఢీకొన్నాడు. ఈ ఘటనలో వైకుంఠరావు అక్కడికక్కడే మృతి చెందగా, రమణ గాయపడ్డాడు. రమణను చికిత్స నిమిత్తం టెక్కలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైకుంఠరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైకుంఠరావు భార్య రత్నాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ వి.సత్యనారాయణ తెలిపారు. మృతుడికి భార్య రత్నాలుతోపాటు కుమారుడు శశిభూషణరావు ఉన్నారు.

## హోటల్‌లో అగ్నిప్రమాదం

పాతపట్నం సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ చేరువలో గల అబ్బీబ్బీ హోటల్‌లో శుక్రవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అబ్బీబ్బీ హోటల్‌లోని మంది చాంబర్‌లో ఒక్కసారిగా పొగలు రాజుకోడంతో పరిసరవాసులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ కె.మధుసూదనరావు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. సమాచారాన్ని పక్కనే గల ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడి అగ్నిమాపక శాఖ అధికారులకు తెలియజేయడంతో హుటాహుటిన చేరుకుని మంటలను అదుపు చేశారు. కాగా ఏసీలో ఏర్పడిన విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్లే ఈ ప్రమాదం జరిగిందని అధికారులు భావిస్తున్నారు.

## రెండుచోట్ల బంగారు పుస్తెల తాళ్లు చోరీ

పాతపట్నం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): పాసిగంగుపేట, చంద్రయ్యపేట గ్రామాల్లో గురువారం రాత్రి సుమారు 12.30 గంటల సమయంలో చోటుచేసుకొన్న చోరీలో బంగారు పుస్తెలు తాళ్లు దొంగతనానికి గురైనట్టు ఎస్‌ఐ కె.మధుసూధనరావు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. ఇళ్లల్లో నిద్రించి ఉండగ పాసిగంగుపేట గ్రామానికి చెందిన గంగు లక్ష్మి మెడలో నుంచి రెండు తులాల బంగారు పుస్తెలతాడు చోరీచేశారు. అలాగే చంద్రయ్యపేట గ్రామంలో ఇంట్లో నిద్రించి ఉన్న మొర్రి పద్మావతి మెడలో నుంచి రెండుతులాల పుస్తెలతాడు దొంగిలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. దసరా సెలవుల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇస్తే.. ఆయా ప్రాంతాల్లో గస్తీ ఏర్పాటు చేస్తామన్నారు. ఎవరైనా అనుమానాస్పందంగా తారాసపడితే సమాచారం ఇవ్వాలన్నారు.

## తగ్గించిన ధరల బోర్డులు ప్రదర్శించాలి



మాట్లాడుతున్న జీఎస్‌టీ ఏసీ నాగరాజు

పలాస, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వ్యాపారంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిందని, ప్రస్తుతం ఉన్న జీఎస్‌టీ విధానాన్ని జీఎస్‌టీ 2.0 పేరుతో మొత్తం పన్నులు తగ్గించిదని, దీన్ని వ్యాపారులు తక్షణం అమలు చేయడంతో పాటు తగ్గిన ధరలు, పాత ధరలు తెలిపే బోర్డులు ఏర్పాటు చేయాలని పలాస జీఎస్‌టీ అసిస్టెంట్ కమిషనర్ కె.నాగరాజు కోరారు. శుక్రవారం మధ్యాహ్నం స్థానిక జీడిపప్పు ఉత్పత్తిదారుల సంఘం(పీసీఎంఎ) భవనంలో పలాస-కాశీబుగ్గ జంట పట్టణ వ్యాపారులు, ట్రేడ్ లైసెన్స్‌దారులతో అవగాహన కార్యక్రమాన్ని జీఎస్‌టీ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. పీసీఎంఎ అధ్యక్షుడు మల్లా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ప్రతి వ్యాపారి ఫైనాన్స్ అవగాహన కలిగి ఉండాలన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన సూపర్ జీఎస్‌టీ సూపర్ సేవింగ్‌ను అందిపుచ్చుకొని ఖాతాదారులకు నిర్దేశించిన ధరలకు విక్రయాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. పీసీఎంఎ ప్రధాన కార్యదర్శి టంకాల రవిశంకర్‌గుప్తా, కోశాధికారి మల్లా సంతోష్, పారిశ్రామికవాడ అధ్యక్షుడు మల్లా రామేశ్వరరావు, వ్యాపారులు మల్లా భాస్కరరావు, సిందిరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించండి

(ఐదో పేజీ తరువాయి)

పెరుగుతాయ'ని తెలిపారు. జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ చంద్రకళ మాట్లాడుతూ నాలుగు స్లాబులుగా ఉన్న జీఎస్టీని రెండు స్లాబులు చేసారని, దీనిపై గ్రామ సచివాలయాలు, స్వయం సహాయక సంఘాలు గ్రామస్థాయి సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్య క్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డ్వామా పీడీ సుధాకర్, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, డిప్యూటీ కలెక్టర్ లక్ష్మణమూర్తి, డీపీవో భారతీ సౌజన్య, అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్, జడ్పీ సీఈవో శ్రీధర్‌రాజా, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, మత్స్యశాఖ అధికారి సత్యనారాయణ, ఆర్ఐఓ దుర్గారావు, జీఎస్టీ అధికారులు పాల్గొన్నారు.

## నేడు అమృత్‌భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం

(ఐదో పేజీ తరువాయి)

ఖరియారోడ్, మహాసముంద్, లఖోలి, బద్ధియా, రాయఘడ, నాగపూర్, బుసావల్ వంటి రైల్వేస్టేషన్ల గుండా ప్రయాణిస్తుంది. ఆధునిక ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో తయారు చేసిన ఈ రైలు సీటింగ్ ఏర్పాటు, మెరుగైన సౌకర్యాలు కల్పించారు. మొ త్తం 22 కోచ్‌లు ఉండే ఈ రైలులో 11 జనరల్ సెకండ్‌క్లాస్ సిటింగ్ కోచ్‌లు, స్లీపర్ క్లాస్‌కోచ్‌లు, రెండు సెకండ్ క్లాస్-లగేజీ వ్యానులు, ప్యాంట్రీకార్ పొందుపరిచారు.

### పలాస రైల్వేస్టేషన్‌ను పరిశీలించిన డీఆర్ఎం


పలాస రైల్వేస్టేషన్‌లో డీఆర్ఎం అలోక్ త్రిపాఠి

అమృత్‌భారత్ రైలును పలాస రైల్వే స్టేషన్‌లో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు జెండా ఊపి ప్రారంభిస్తారని రైల్వేశాఖ ప్రకటించింది. శనివారం మధ్యాహ్నం 12.45 గంటలకు పలాస రైలు చేరుతుందని, ఆయనతోపాటు ఎమ్మెల్యే గౌతు శిరీష కూడా హాజరుకానున్నారని పేర్కొంది. ఈ మేరకు శుక్రవారం మధ్యాహ్నం ఈస్ట్‌కోస్ట్‌రైల్వే ఖుర్ధారోడ్ డివిజన్ రైల్వేమేనేజర్ అలోక్ త్రిపాఠి పలాస రైల్వేస్టేషన్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. ఫ్లాట్‌ఫారం 2లో రైలును నిలుపుదల చేయనుండడంతో స్టేషన్‌ను సుందరీకరించారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా కార్యక్రమం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కమర్షియల్ మేనేజర్ అనిల్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

# శ్రీమహాలక్ష్మిగా.. దుర్గమ్మ

దేవిశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గమ్మ శుక్రవారం శ్రీమహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పలు గ్రామాల్లో అమ్మ వారిని వివిధ రూపాల్లో అలంకరించారు. ఈ సందర్భంగా సామూహిక కంకుమ పూజలు చేపట్టారు.

- ఆంధ్రజ్యోతి బృందం


నరసన్నపేట: ఉర్లాంలో కరెన్సీ నోట్ల అలంకరణలో అమ్మవారు


గార: కుంకుమపూజలు చేస్తున్న దృశ్యం


వజ్రపుకొత్తూరు: బైపల్లిలో కుంకుమ పూజలు


జలుమూరు: సారవకోట మండలం అవలింగిలో శాకంబరిదేవిగా నీలమణి అమ్మవారు


పాతపట్నం: శ్రీమహాలక్ష్మి అలంకరణలో నీలమణి దుర్గమ్మ


శ్రీకాకుళం: బొందిలీపురంలో తుల్జాభవానీ ఆలయం వద్ద..


సోంపేట: కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు


ఎచ్చెర్ల: కుంచాల కురమయ్యపేటలో..


కవిటి: మాణిక్యపురంలో అమ్మవారి ఊరేగింపు..


పొందూరు: కంచికామాక్షి అమ్మవారి ఆలయంలో..


నందిగాం: దిమ్మిడిజోలలో దేవీ మండపం వద్ద

## ఉత్సవాల విజయవంతంపై మంత్రి అభినందన

కోటబొమ్మాళి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): కొత్తమ్మతల్లి శతాబ్ది ఉత్సవాలు విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి, ముఖ్యంగా రేయింబవళ్లు శ్రమించిన యంత్రాంగానికి రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శుక్రవారం ఒక ప్రకటన ద్వారా అభినందనలు తెలిపారు. ఉత్సవాలకు సంబంధించి పది రోజులుగా ఏర్పాట్లలో తలమునకలైన అధికార, అనధికార వర్గాల కృషి, అలాగే పారిశుధ్య సిబ్బంది అంకిత భావం మరువ లేనిదన్నారు. సచివాలయంలో ఉంటూ తాను నిర్ధేశించిన ప్రతి మాటనూ పాటించి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు, అమ్మవారి భక్తులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా దివ్య దర్శనం అయ్యేందుకు కృషి చేసిన పోలీసులు, సిబ్బంది సేవలు చిరస్మరణీయమన్నారు. ఆర్టీసీ సిబ్బంది, వలంటీర్ల సేవలు ఎంతో బాగున్నాయన్నారు. అధికారులంతా సమన్వయంతో పని చేసి ఉత్సవాలకు వన్నె తెచ్చారని కొనియాడారు. ఇదే స్ఫూర్తితో జిల్లా అభివృద్ధి అంతా కృషి చేయాలని పిలుపు నిచ్చారు.

## కొత్తమ్మతల్లి జాతర ఆదాయం రూ.22 లక్షలు


హుండీలను లెక్కిస్తున్న దేవదాయశాఖ సిబ్బంది

కోటబొమ్మాళి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తమ్మతల్లి జాతర శతాబ్ది ఉత్సవాల ద్వారా మంగళ, బుధ, గురువారాల్లో రూ.22.08.481.00 ఆదాయం వచ్చినట్టు ఆలయ కార్యనిర్వాహణాధికారి వాకచర్ల రాధాకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ధర్మహుండీలను దేవదాయ శాఖ అధికారులు, గ్రామపెద్దల సమక్షంలో లెక్కించారు. హుండీల ద్వారా రూ. 15.44,881, ప్రత్యేక దర్శనం టికెట్ల ద్వారా రూ.4.25.000, మొక్కుబడి టిక్కెట్లు ద్వారా రూ.2.38.600 ఆదాయం లభించిదన్నారు. గతేడాది కంటే ఈ సారి రూ.3.86.964 ఆదాయం పెరిగిందన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఏసీ టీఆర్‌వీవీ ప్రసాద్ పట్నాయక్, ధర్మకర్తలి మండలి ఛైర్మన్ కోరాడ గోవిందరావు, గ్రామపెద్దలు బోయిన రమేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ ఉత్సవాలకు సహకరించిన అన్ని శాఖ అధికారులకు, ప్రజాప్రతినిధులకు, పోలీసులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

నరసన్నపేట, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రత్యేకావసరాలు గల పిల్లలకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సమగ్రశిక్ష అభియాన్ పథకం అదనపు సంచాలకులు ఎస్.శశిభూషణ్‌రావు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నియోజవర్గస్థాయి ప్రత్యేక అవసరాలు గల పిల్లల పరికరాల నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కాన్పూర్‌కు చెందిన ఆల్‌మెక్ సంస్థ నుంచి వచ్చిన వైద్యులు ప్రత్యేక అవసరాలు గల పిల్లలను పరీక్షించారు. అర్హులైన వారికి వీల్ ఛైర్లు, ట్రైసైకిల్స్, రొలేటర్స్, హియోరింగ్ మిషన్లు ఉచితంగా అందజేయనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయానంద్, జిల్లా సహిత విద్యా సమన్వయకర్త బి.గోవిందరావు, ఎంఈవోలు ఉప్పాడ శాంతారావు, పి. దాలినాయుడు, బి. మాధవరావు, క్రిష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## శివాలయం పనుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న దువ్వాడ శ్రీధర్, కమిటీ సభ్యులు

పలాసరూరల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మాకన్నపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయాన్ని పలాస పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ దువ్వాడ శ్రీధర్ శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. ఈ దేవాలయ ప్రాంగణంలో ప్రధానమైన శివాలయంతో పాటు గణపతి, పార్వతీదేవి, బ్రహ్మణ్యస్వామి, శనీశ్వర ఉపదేవాలయాలను నిర్మిస్తుండడంతో వాటిని పరిశీలించి ఆలయ కమిటీసభ్యులతో మాట్లాడారు. ధ్వజస్తంబం, గాలిగోపురం నిర్మాణం, ఫ్లోరింగ్ కోసం రూ.4లక్షల విలువ చేసే గ్రానైట్ పలకను దువ్వాడ శ్రీధర్ ఆలయానికి వితరణగా అందజేశారు. సుమారు 70సెంట్ల విస్తీర్ణంలో రూ.2కోట్ల అంచనా వ్యయంతో ఈ ఆలయ నిర్మాణం జరుగుతున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సైని దేశయ్య, మాజీ సర్పంచ్ కుత్తుమ ధర్మారావు, కుత్తుమ లోకనాథం, బత్తిన వీరాస్వామి, తెప్పల భీమారావు, బత్తిన పోలయ్యతో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పాత పింఛన్ సాధించే వరకు పోరాటం

కోటబొమ్మాళి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): సీపీఎస్ ఉద్యోగులకు పాత పింఛన్ సాధించే వరకు పోరాటం ఆగదని ఏపీసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశం మందిరంలో జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు చల్ల సింహాచలం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వ్యవస్థాప సభ్యులు బి.బాలకృష్ణ, ఆదినారాయణ, రమేష్, వైకుంఠరావు, ప్రశాంత్ పాల్గొన్నారు.

## చంద్రబాబును కలిసిన మాజీ మంత్రి గౌతు


చంద్రబాబుతో మాజీ మంత్రి శివాజీ తదితరులు

పలాస, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబును రాజధాని అమరావతిలో మాజీ మంత్రి గౌతు శ్యాంసుందర్ శివాజీ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆయన వెంట మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, విప్ బెందాళం అశోక్, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఉన్నారు.

## ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి


జైలు పరిసరాలను పరిశీలిస్తున్న జిల్లా న్యాయాధికారి

గార రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. మండలంలోని అంపోలులో ఉన్న జిల్లా జైలును శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఖైదీలు దరఖాస్తు చేసుకున్న బెయిల్ పిటిషన్లను పరిశీలించారు. అనంతరం ఖైదీలకు అందిస్తున్న భోజనం తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. జైలు పరిసరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమం జైలరు దివాకర్ నాయుడు ఉన్నారు.

## రక్తదాన శిబిరం

పోలాకి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి మోదీ జన్మదిన కార్యక్రమం శుక్రవారం స్థానిక బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసి రక్తదాన శిబిరంలో 15 మంది రక్తదానం చేశారు. అలాగే 70 మందికి వైద్య పరీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు. రక్తదాన శిబిరంలో పాల్గొన్న వారికి ధ్రువపత్రాలను జిల్లా బీజేపీ నాయకులు పైడి వేణుగోపాలరావు, టీడీపీ మండలశాఖ అధ్యక్షులు ఎంవీ నాయుడు, బైరి భాస్కరరావు, కిల్లి వేణు, బీజేపీ మహిళా నాయకులు పాల్గొన్నారు.

## రీ సర్వే తర్వాత 1బీలు రావడంలేదు


పాసుపుస్తకాలు చూపిస్తున్న గిరిజనులు

హిరమండలం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని డీ పట్టా భూములకు రీ సర్వే తర్వాత 1బీలు రావడంలేదని పలు గిరిజన గ్రామాలకు చెందిన కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఈ మేరకు శుక్రవారం లోకొండ, సవర చొర్లంగి గ్రామాలకు చెందిన గిరిజనులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో సుమారు 50 గిరిజన గ్రామాలు ఉన్నాయని అందులో కొన్ని కుటుంబాలకు డీ పట్టా భూములు ఉన్నాయని చెప్పారు. గతంలో ఈ భూములకు 1బీలు వచ్చేవని రీ-సర్వే తర్వాత రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో బ్యాంకులో రుణాలు పొందాలన్నా, రెన్యువల్ చేసుకోవాలన్నా కుదరడంలేదన్నారు. అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని వారంతా కోరతున్నారు.

## ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి


మహిళలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సంతబొమ్మాళి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంపై మహిళలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని బోరుభద్ర పీహెచ్‌సీ వైద్యాధికారి ఆవని అన్నారు. శుక్రవారం పీహెచ్‌సీలో స్వస్థ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజరు కమల సిబ్బంది పాల్గొన్నారు.

## విస్తృత ప్రచారం చేయాలి

పలాస, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): సూపర్‌సిక్స్ కార్యక్రమాలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని, సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసేలా పనిచేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఏపీటీపీసీ ఛైర్మన్ వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు తదితరులు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బడ్డ నాగరాజు, సప్ప నవీన్, టంకాల రవిశంకర్‌గుప్తా, దువ్వాడ హేమబాబుచౌదిరి, సూరాడ మోహనరావు, దువ్వాడ శ్రీకాంత్, డొక్కరి శంకర్ పాల్గొన్నారు.

## కేజీబీవీపై జేసీకి నివేదిక

కొత్తూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): వసప కేజీబీవి ప్రిన్సిపాల్ రాధిక అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన బియ్యం వ్యవహారంపై జాయింట్ కలెక్టర్‌కు, టెక్కలి ఆర్డీవోకు నివేదికలు పంపుతున్నట్టు తహసీల్దార్ కె.బాలకృష్ణ తెలిపారు. పాఠశాలలో అక్రమంగా నిల్వ చేసిన 10.5 క్వింటాలు బియ్యం పట్టుకున్నట్టు స్పష్టం చేశారు.

## ముట్టడిని విజయవంతం చేయాలి

టెక్కలి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): కింజరాపు కుటుంబం మైన్స్ విభాగంలో పాల్పడుతున్న అక్రమాలపై వచ్చే నెల 6న చేపట్టనున్న మైన్స్ ఏడీ కార్యాలయం ముట్టడిని విజయవంతం చేయాలని టెక్కలి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి పేడాడ తిలక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మైనింగ్‌లో విజిలెన్స్ విభాగం నీరుగారిపోయిందని, విజిలెన్స్ ఎస్పీ నిరంకుశ వైఖరితో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో శ్రీరామ్మూర్తి, రాహుల్, అజయ్, రమేష్, జోగారావు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## బంగారం దుకాణాలపై దాడులు

(ఐదో పేజీ తరువాయి)

తెలుస్తోంది. పూర్తిస్థాయిలో దాడులు నిర్వహించి వివరాలను వెల్లడిస్తామని సంబంధిత శాఖ అధికారి తెలిపారు. దర్యాప్తు పూర్తయితే పేట హోల్‌సేల్ వ్యాపారుల బండారం బయట పడే అవకాశం ఉంది.

### తొలిసారిగా దాడులు

నరసన్నపేటలో ఇటీవల బంగారం వ్యాపారంలో లుకలుకలపై బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ అధికారులు దాడులు నిర్వహించి నకిలీ హాల్‌మార్కులు వేసి అమ్మకాలు చేస్తున్న గుడ్ల నాగరాజుకు చెందిన జీఎన్ఆర్ బంగారం షాపులో తనిఖీలు చేసి బంగారం ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే నకిలీ హాల్‌మార్కు వేసిన షాపుపై దాడులు చేపట్టారు. తాజాగా నరసన్నపేటలో కేంద్ర జీఎస్టీ అండ్ కస్టమ్స్ అధికారులు దాడులు చేపట్టడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. కాగా జీఎస్టీ అధికారుల దాడులతో బంగారం వ్యాపారుల్లో అలజడి రేగింది. తూనికలు కొలతలుశాఖ, బీఐఎస్, జీఎస్టీ అధికారులు ఎవరు దాడిచేసినా తాము చేసే వ్యాపారాల బండారం బయట పడతుందని భయాందోళన చెందారు. ఈ నేపథ్యంలో చాలామంది వ్యాపారులు బంగారం దుకాణాలను మూసేశారు.

## ఐతమ్‌లో 'ఏఐ'పై ఇంటర్న్‌షిప్

టెక్కలి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): కె.కొత్తూరు దరి ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్స్ సైన్స్ ఇంజనీరింగ్ విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన అవ్యాన్ ఆల్ సంస్థ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్టు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వీవీ నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ జనరేటివ్ ఆల్, ఇంటర్న్‌షిప్ అవకాశాలపై సమగ్ర శిక్షణ అందించారన్నారు. ఈ కార్యక్రమానికి అవ్యాన్ ఆల్ సీఈవో సుధాకర్ గంటా, సహ వ్యవస్థాపకుడు శ్రీనివాస్ బొమ్మెన హాజరై విద్యార్థులకు ప్రేరణనిచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎస్ శ్రీనివాసరావు, డీన్ డాక్టర్ జి.ప్రసన్నలక్ష్మి, హెచ్‌వోడీలు డాక్టర్ వై.రమేష్, డాక్టర్ బి.రమేష్‌నాయుడు, డాక్టర్ చంద్రశేఖర్, టి.చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

## సద్వినియోగం చేసుకోవాలి

నందిగాం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఉచిత పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు పి.చంద్రశేఖర్ కోరారు. శుక్రవారం గొల్లూరులో ఏర్పాటుచేసిన ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని సర్పంచ్ జీరు రాజేశ్వరీ నానీరెడ్డి ప్రారంభించారు. 32 పశువులకు గర్భకోశ పరీక్షలు, పది పశువులకు గర్భాదారణ పరీక్షలు, 12 పశువులకు సాధారణ చికిత్సలు నిర్వహించారు.

## సమన్వయంతో చేపట్టాలి

జలుమూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య పనులు అధికారులంతా సమన్వయంతో చేపట్టాలని ఎంపీడీవో బి.చిన్నమ్మడు అన్నారు. తన కార్యాలయంలో శుక్రవారం అధికారులతో సమీక్షించారు. తహసీల్దార్ జె.రామారావు తదితరులు పాల్గొన్నారు.